క్లుప్తంగా

శభాష్.. వలంటీర్



మరియమ్మకు కడప రిమ్స్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుభాషిణి

బద్వేలు అర్బన్ : వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధి నిర్వహణలో సేవా దృక్పథంతో వ్యవహరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. బద్వేలు మున్సిపాలిటీలోని 33వ వార్డులో గల బంకపాలెం గ్రామానికి చెందిన బంక వీరయ్య అనారోగ్యంతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన బి.మరియమ్మ అనారోగ్యంతో ఉన్న తన కుమారుడికి కడప రిమ్స్‌లో చికిత్స చేయించుకుంటూ అక్కడే ఉంది. దీంతో సంబంధిత వార్డు వలంటీర్ సుభాషిణి తన స్వంత ఖర్చులతో కడపకు చేరుకుని ఆపదలో ఉన్న ఇరువురికి పింఛన్ సొమ్మును అందజేసింది. వలంటీర్ సుభాషిణిని గ్రామస్తులతో పాటు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని శ్రీమహాయోగి వేమారెడ్డి సంక్షేమ నిత్యాన్నదాన సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పెండ్లిమర్రి మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి గంగిరెడ్డి సోమవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రఘునాథరెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, చెన్నూరు నిరంజన్ రెడ్డి, దువ్వూరు మండల నాయకుడు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాజుపాళెంలో సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొంటారని, ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

8న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక వెంకటేశ్వర్ల పేటలోని సరస్వతి విద్యామందిరంలో ఈనెల 8న ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రొద్దుటూరు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేస్తారన్నారు. గుండె నొప్పి, గుండె దడ, ఆయాసం, గుండెలో మంట తదితర సమస్యలకు వైద్యం అందిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ నెల 5న కలసపాడుకు జీయర్ స్వామి రాక

కలసపాడు : విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి ఈ నెల 5న కలసపాడు రానున్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని శ్రీకృష్ణ మందిరానికి రానున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మలిశెట్టి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సనాతన భారతీయ తాత్విక చింతన వ్యాప్తి కొరకు, సమాజంలోని రుగ్మతలు తొలగించి, శాంతిని నెలకొల్పేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా గొడుగుల ఉత్సవం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో గొడుగుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని గ్రామ ప్రజలు నిర్వహించారు. సోమవారం 3 రోజులు కావడంతో గొడుగుల ఉత్సవాన్ని జరిపారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫోటో, వీడియోగ్రఫీ, సెల్ ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లలో గ్రామీణ యువకులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వివరాలకు 9440 905478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తూ మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున నష్ట పరిహారం అందించారు. సోమవారం గాంధీ జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్ చేతుల మీదుగా వారికి చెక్కులు అందజేశారు.

గాంధీజీ గ్రామ స్వరాజ్యం జగన్‌తో సాధ్యం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

మైదుకూరు : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కళ్ల ముందు నిలిపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యంతో అక్కడే పరిపాలన, అక్కడే సమస్యల పరిష్కారం ఉండాలని గాంధీజీ భావించారు. దానిని నూరు శాతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని తెలిపారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 15వేల సచివాలయాలను నిర్మించారని కొనియాడారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014–19 కాలంలో అనధికారికంగా ఏర్పాటైన జన్మభూమి కమిటీలు దోపిడీకి పాల్పడ్డాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అలాంటి అవినీతికి తావు లేదని తెలిపారు. జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ.3వేలుకు పెరగనుందని అన్నారు.

చంద్రబాబు అవినీతి పిత

మహాత్మా గాంధీ స్వాతంత్య్ర కోసం పోరాడారని అందుకే ఆయన జాతిపిత అయ్యారని, చంద్రబాబు అవినీతిలో మునిగి తేలారని అందుకే ఆయన అవినీతి పిత అయ్యారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రస్తుతం అవినీతి పిత చంద్రబాబు జైలులో ఉన్నారని, మరికొందరు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఎంతో ఆశయంతో స్థాపించిన పార్టీని చంద్రబాబు సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, నియోజకవర్గంలోని ఎంపీపీలు సి.వీరనారాయణరెడ్డి, టి.లక్ష్మయ్య, జయచంద్రారెడ్డి, సిద్ధిక్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు గలాల నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, సింగిల్ విండో చైర్మన్లు మూలే సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

మైదుకూరు : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి వీర వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం కోర్టు ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి ఆవరణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ నారాయణరెడ్డి, న్యాయవాదులు మూలే నాగిరెడ్డి, ఆవుల వెంకటరమణ, బాలవెంకటయ్య, దేవంద్రకుమార్, కోర్టు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని సోమవారం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరనారయణరెడ్డి మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చి చూపించారన్నారు. గొడ్లవీడు, రేకలకుంట, బిమఠం, మల్లేపల్లె, ముడుమాల, నాగిశెట్టిలపల్లె, తదిర గ్రామ సచివాలయాల్లో గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సర్పంచ్‌లు, సిబ్బంది నివాళి అర్పించారు.

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీ పాత్రను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం.. అనుసరణీయం

బద్వేలు అర్బన్ : జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింస మార్గం అనుసరణీయమని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో, బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పోరుమామిళ్ళ రోడ్డులోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సుందరయ్య భవనంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఖైదీలు సత్ప్రవర్తన తెచ్చుకుంటేనే సార్థకత

క్షణికావేశంలో చేసిన తప్పులను సత్ప్రవర్తనతో మార్పు తెచ్చుకున్నపుడే తమ జీవితానికి సార్థకత ఉంటుందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం సబ్ జైలులో జైలు సూపరింటెండెంట్ శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతిపిత గాంధీ మహాత్ముడు కూడా స్వాంతంత్య్రం కోసం జైలు జీవితం గడిపి, జైలులోనే ఎంతో నైపుణ్యాన్ని పెంచుకున్నారని తెలిపారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖైదీలకు పండ్లు, స్వీట్లు అందజేశారు.

కలసపాడు మండలంలో

కలసపాడు : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్ బీ, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రవీంద్రారెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోపవరం సచివాలయంలో సర్పంచ్ వెంకటలక్షుమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ జయంతి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి అర్పించిన వివిధ సంఘాల నాయకుల

పోరుమామిళ్ల : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ మహిళ నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నాయకులు, సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఘనంగా మహాత్మాగాంధీ జయంతి

కాశినాయన : మండలంలోని గ్రామ సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసాపురం పోలీసుస్టేషన్ ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకుని సీఐ చిరంజీవి, ఎస్ఐ హరిప్రసాద్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బికోడూరు మండలంలో..

బి.కోడూరు : మండలంలోని అన్ని సచివాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మండల కేంద్రమైన బి.కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ దావీదు, సర్పంచ్ మునిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రావుల ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచానికి మార్గదర్శకుడు గాంధీజీ

ప్రొద్దుటూరు : మహాత్మాగాంధీ ప్రపంచానికే మార్గదర్శకుడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ ఒకే రోజు జన్మించడం గొప్ప విశేషమని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా సోమవారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్ముడు జన్మించిన ఈ నేలపై మనం జన్మించడం ఎంతో అదృష్టమన్నారు. మనుషులు ఎలా జీవించాలో నేర్పించింది ఆయనే అని తెలిపారు. గాంధీజీ అహింసను ఆయుధంగా చేసుకుని పోరాటం చేశారన్నారు. అహింసా విధానంలో దేనినైనా సాధించవచ్చని ఆయన నిరూపించారన్నారు. దేశం స్వాతంత్య్రం కోసం ఆయన చేసిన పోరాటం జీవితాంతం గుర్తుండి పోతుందన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రీ అవినీతి, లంచగొండితనం లేకుండా నీతి, నిజాయితీతో పరిపాలన చేశారన్నారు. రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో రైలు ప్రమాదం జరిగితే నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్ కమాల్, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, నాయకులు బాలకృష్ణ, జిల్లా ప్రభుత్వాస్పత్రి సలహా కమిటీ సభ్యుడు నరాల మల్లికార్జునరెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో..

స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి అవోపా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. అవోపా ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య, సెక్రటరీ పచ్చిపులుసు నరసింహారావు, ట్రెజరర్ జయం సురేష్ బాబు, డిస్ట్రిక్ట్ మాజీ ప్రెసిడెంట్ గాదంశెట్టి గోపాలరావు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు.. కార్యాలయాల్లో..

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్యాలయాల్లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి ఉపాధ్యాయసంఘాల సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, గంగాధర్, సాయికుమార్, జింకా శేఖర్ తదితరులు పాల్గొన్నారు. రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహానికి ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు సరస్వతీ రెడ్డి, కార్యదర్శి ఉషారాణి, మణిశయన, కళ్యాణి, సునంద, అక్షితలు పూలమాల వేసి నివాళి అర్పించారు. బాలాజీ టవర్స్‌లో గాంధీ, శాస్త్రీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సాయినాథ్, సుజన, గజ్జల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ వారు స్వచ్ఛభారత్ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిరెడ్డి, కార్యదర్శి కాకర్ల రమేష్, సతీష్‌బాబు, జిలాన్, ప్రసాద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. గీతాంజలి హైస్కూల్‌లో గాంధీజీ, భరతమాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి పాల్గొన్నారు. వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ సేవా కేంద్రంలో గాంధీజీ, శాస్త్రీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉపాధ్యాయులు మునయ్య, అధ్యాపకుడు మధుసూదన్‌బాబు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాణీ తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రీలకు ఘన నివాళి

స్థానిక రోటరీ క్లబ్‌లో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతులను సోమవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కోశాధికారి బాలసూర్యారావు, మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, ఎం.సూర్యనారాయణ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, బాషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కలలను సాకారం చేద్దాం

ప్రొద్దుటూరు క్రైం : జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేద్దామని బీజేపీ నాయకులు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీరోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, మహమ్మద్ రఫి, సుధీకర్, మల్లేశ్వరమ్మ, శరత్‌బాబు, నాగరాజు, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోనేటి కృష్ణ ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. కోనేటి ప్రదీప్‌రెడ్డి, గౌరీశంకర్, రవి, సుధాకర్‌రెడ్డి, నరేష్, చలపతి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్: నివాళులర్పిస్తున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి



ప్రొద్దుటూరు కల్చరల్‌గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు



పోరుమామిళ్ల: సీపీఎం ఆధ్వర్యంలో..

లక్కీ డిప్‌లో విజేతల ఎంపిక



లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్ర

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో వారు నిర్వహించిన లక్కీ డిప్‌లో విజేతలను సోమవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఎంపిక చేశారు. మైదుకూరు డిపో బస్సుల్లో కడప–పోరుమామిళ్ల, మైదుకూరు–గిద్దలూరు రూట్లలో ప్రయాణించే వారి కోసం ఆర్టీసీ అధికారులు లక్కీ డీప్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు ప్రయాణించిన వారి టికెట్ల నుంచి విజేతలను మున్సిపల్ చైర్మన్ ఎంపిక చేశారు. కడప–పోరుమామిళ్ల సర్వీస్‌కు సంబంధించి ఎన్.లోకాంక్ష, ఎం.మేరి, జే.సుబ్రహ్మణ్యం విజేతలుగా నిలిచారు. మైదుకూరు–గిద్దలూరు సర్వీసులకు సంబంధించి ఎం.సలీం, పి.అనురాధ, జి.సుబ్రహ్మణ్యం విజేతలుగా ఎంపికయ్యారు. వీరికి మల్లికార్జున, ఉత్తమ రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఎస్టీఐ మంజుల, ఉద్యోగుల యూనియన్ నాయకులు శివారెడ్డి, వీఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రశ్నించే వారిని, ప్రతిపక్షాలను మాట్లాడించే పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవని, దీంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. మహాత్మా గాంధీజయంతి సందర్భంగా సోమవారం స్థానిక గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీని స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో సులభ్ కాంప్లెక్స్ గోడలపై ముద్రిండానికే మోదీ ప్రభుత్వం పరిమితమైంది తప్ప ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు మచ్చా శ్రీను, చంద్రశేఖర్, యేసోబ్, ప్రమీల, సుజాత, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షుడు సందీప్, సహాయ కార్యదర్శి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు డి. నేలటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

బ్రహ్మంగారిమఠం : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం ఉదయం 9గంటలకు మండలంలోని డి.నేలటూరు గ్రామంలో డాక్టర్ మల్లేసు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఈఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఎగువ రామాపురంలో..

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ బీ తెలిపారు. ఈ క్యాంపులో నలుగురు స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొంటారన్నారు.

నేడు రంపాడులో..

కాశినాయన : మండలంలోని రంపాడు గ్రామ సచివాలయ పరిధిలోని ఓబులాపురం ఆర్బీకే వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి పేర్లు నమోదు చేశారని, వారందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

జగన్ చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి వివరించాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి

ప్రొద్దుటూరు: గడిచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన అభివృద్ధిని గడపగడపకు వెళ్లి వివరించడంతోపాటు గతంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు గురించి ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమానికి సంబంధించి సోమవారం సాయంత్రం స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు నుంచి 41వ వార్డు వరకు గల కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గడపగడపకు చేరాయని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మిస్తోందని, ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను వలంటీరుల అందిస్తున్నారని తెలిపారు. చేనేతల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24వేలు చెల్లిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రస్తుతం ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయడం గొప్ప విషయమని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రానున్న నాలుగు నెలలు చేసిన అభివృద్ధిని మనం చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లతోపాటు సచివాలయ కన్వీనర్, గృహ సారథులు, వలంటీర్లు కలసి ఇంటింటికి వెళ్లాలని సూచించారు. పార్టీ క్రియాశీలక కార్యకర్తలందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని సూచించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 11న చౌటపల్లె గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 30వేల ఇళ్లను ఇప్పటి వరకు చరిత్రలో ఏ ప్రభుత్వం నిర్మించలేదన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం ఇదేనని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధితోపాటు గ్రామాలకు రోడ్లు నిర్మించామని, మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. రూ.120 కోట్లతో అమృత్ స్కీం పూర్తి చేసి ప్రజలకు శుద్ధి జలాలు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలో పట్టణంలో డ్రైనేజీ కాలువల ఆధునికీకరణ, పైపులైన్ నిర్మాణ పనులు చేపడతామన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులందరూ ఐక్యంగా మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు, తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసం చేశారు

2014 ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట ప్రకారం విడతల వారిగా రుణమాఫీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ పోసా భాస్కర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మమే దేశానికి శ్రీ రామరక్ష

బద్వేలు అర్బన్ : సనాతన ధర్మమే దేశానికి శ్రీ రామరక్ష అని, ఇటువంటి గొప్ప కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో సనాతన ధర్మం – ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశానికి సనాతన ధర్మం ప్రాణప్రదమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు చెన్నుపల్లె రమణారెడ్డి, సంజీవ రెడ్డి, క్రిష్ణభాస్కర్, పెంచలయ్య, తిరుమలరెడ్డి, సాకే ఈశ్వరయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు బి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిరాఫీ చెస్ పోటీలు



విజేతలతో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిరాఫీ చెస్ అకాడమిలో మూడు వారాలుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలుర అండర్–15 జిరాఫీ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా టీవీఆర్ హైస్కూల్ విద్యార్థి గణేష్ నిలవగా, ద్వితీయ స్థానంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి మోహిత్‌రెడ్డి నిలిచాడు. విజేతకు, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ట్రోఫీలను, మెడల్స్‌ను కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దస్తగిరిరాజ, నాగార్జున పాల్గొన్నారు.

జాబ్ మేళా కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 6న నిర్వహించే జాబ్ మేళా కరపత్రాలను సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు కియా మోటార్స్ ఇండియా, హెచ్‌డీబీ ఫైనాన్స్, అమర్‌రాజా బ్యాటరీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, జె ఇన్‌ఫ్రా గ్రూప్, హెటిరో డ్రగ్స్, బిగ్ బాస్కెట్, బీజెడ్ ఫిన్సర్వ్, నవత ట్రాన్స్‌పోర్టుతోపాటు 13 ప్రముఖ కంపెనీలు వస్తున్నాయని వివరించారు. పూర్తి వివరాలకు 8886297300, 9398348760 నంబర్లలో సంప్రదించాలని కోరారు.